ఈ స్టాంపులతో సేవలు మరింత సులువు

- ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ-స్టాంపింగ్
- నాన్-జ్యుడీషియల్ స్టాంపులకు తగ్గిన అదనపు ఖర్చు
- పారదర్శకతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు

ప్రత్తిపాడు: ప్రభుత్వం రిజిస్ట్రేషన్లలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. పారదర్శకత, వేగవంతం, జవాబుదారీతనం వంటి లక్ష్యాలతో ఈ-స్టాంపింగ్ విధానాన్ని అమలు చేసింది. ఇకపై ఆస్తుల రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్లు వాటి కోసం దస్తావేజులు (నాన్-జ్యుడీషియల్ స్టాంపులు) ఉపయోగించాల్సిన అవసరం లేదు. ఈ-స్టాంపుల ద్వారా ఈ పనులన్నీ చేసుకునే విధానం అందుబాటులోకి వచ్చింది. రిజిస్ట్రేషన్ లావాదేవీల్లో, దస్తావేజు తయారీలో, నాన్-జ్యుడీషియల్ స్టాంపుల కొనుగోలులో పారదర్శకతే లక్ష్యంగా నాన్-జ్యుడీషియల్ స్టాంపులతో సమానంగా ఈ-స్టాంపులు పనిచేస్తాయి. ఈ విధానం(ఆన్‌లైన్ సర్వీసు)తో రిజిస్ట్రేషన్ల సేవలు మరింత సులువవుతాయి. కాలానుగుణంగా మారుతున్న సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకుంటూ అన్ని సేవలను సామాన్యులకు సైతం సరళంగా అర్థం చేసుకునేలా చేశారు. అఫిడవిట్లు, బ్యాంకు లోన్లు, తనఖాలు వంటి వాటితో పాటు రిజిస్ట్రార్ సేవలైన కొనుగోలు, బహుమానాలు, ఫ్యామిలీ సెటిల్‌మెంట్లు, పంపకాలు వంటి వ్యవహారాలకు స్టాంప్ పేపర్లు (నాన్-జ్యుడీషియల్) తప్పనిసరి అయ్యాయి. ఈ క్రమంలోనే ఈ-స్టాంప్ విధానానికి రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ శ్రీకారం చుట్టింది. అపోహలను పక్కన పెట్టి దస్తావేజు (నాన్-జ్యుడీషియల్) పేపర్లకు బదులుగా ఈ-స్టాంపులు వాడుకోలని ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డి చెబుతున్నారు. ఇందు కోసం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కామన్ సర్వీసు సెంటర్ (కౌంటర్)ను ఏర్పాటు చేశారు.



కొనుగోలుదారునికి ఈ-స్టాంపు పేపరును అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్ సుబ్బారెడ్డి

ఏటా సగటున 28 వేల స్టాంపు పేపర్ల విక్రయం

ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఏటా సగటున 28 వేల స్టాంపు పేపర్ల విక్రయం జరుగుతోంది. ఈ కార్యాలయం పరిధిలో ప్రత్తిపాడు మండలంలోని 44 గ్రామాలు, ఏలేశ్వరం మండలంలోని 11 గ్రామాలు, ఏలేశ్వరం నగర పాలక సంస్థ, శంఖవరం మండలంలోని కత్తిపూడి, రామన్నపాలెం, వజ్రకూటం, ఒంట్రేగుల, ఎరకాపురం, పిఠాపురం మండలంలోని వెల్దుర్తి, పి దొంతమూరు, కిర్లంపూడి మండలంలోని కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి, గెద్దనాపల్లి, రామకృష్ణాపురం, రాజుపాలెం, ముక్కొల్లు, వేలంక, గొల్లప్రోలు మండలంలోని చెందుర్తి, చిన జగ్గంపేట, కొడవలి, వన్నెపూడి వెరసి 76 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లోని ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ఇక్కడే జరుగుతాయి. వీటికి సంబంధించి ఏటా సగటున రూ.10 స్టాంపు పేపర్లు 9 వేలు, రూ.20 స్టాంపులు 4 వేలు, రూ.50 స్టాంపులు 6 వేలు, రూ.100 స్టాంపులు 9 వేలు విక్రయిస్తున్నారు. గతంలో మాదిరిగా దస్తావేజు స్టాంపులను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన అవసరం కూడా లేదు. నాన్-జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల మాదిరిగా రూ.10, రూ.20, రూ.50, రూ.100 ఎంత డినామినేషన్ ఈ-స్టాంపుల ద్వారా పొందవచ్చు.

తగ్గిన వ్యయ ప్రయాసలు

దస్తావేజు (స్టాంపు) పేపర్లు నాసిక్‌లోని కరెన్సీ ప్రింటింగ్ చేసే చోట ప్రింట్ అవుతాయి. నాలుగైదు వాహనాల్లో డీఆర్, నలుగురు ఎస్ఆర్వోలు, పది మంది సిబ్బంది నాసిక్ వెళ్లి పోలీస్ బందోబస్తుతో దస్తావేజు పేపర్లను విజయవాడ తీసుకునివచ్చేవారు. సబ్ రిజిస్ట్రార్లు విజయవాడ వెళ్లి, వాటిని తీసుకుని వచ్చేవారు. ఈ-స్టాంపులు అమలులోకి రావడం వల్ల సుదూర ప్రయాణం, శ్రమ, ధన వ్యయం వంటి భారాలు తగ్గాయి. నేరుగా కామన్ సర్వీసు సెంటర్ ద్వారా పొందవచ్చు.

లాభాలు



ఈ-స్టాంప్

- కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్‌సీ), ఎంపిక చేసిన బ్యాంకుల్లో ఈ-స్టాంపులు లభిస్తాయి.
- నాన్-జ్యుడీషియల్ స్టాంపు(దస్తావేజులు) పేపర్ల కంటే ఈ-స్టాంపులకు భద్రత ఎక్కువ.
- పాత తేదీలపై స్టాంపుల విక్రయించే అవకాశం ఉండదు. వీటిని ట్యాంపరింగ్ చేయడం అసాధ్యం.
- దస్తావేజుల వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణ ఉండేది కాదు. ఈ-స్టాంపింగ్ వ్యవస్థ పూర్తిగా ప్రభుత్వ అధీనంలో ఉంటుంది.
- ప్రస్తుతమున్న నాన్-జ్యుడీషియల్ స్టాంపు పేపర్‌కు సమానమైన విలువ సమాంతరమైన సేవలు ఈ-స్టాంపింగ్‌తో లభిస్తాయి.
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేక ఈ-స్టాంపు కౌంటర్ల ద్వారా అన్ని రకాల పేమెంట్లు చెల్లించే సౌకర్యం ఉంటుంది.
- రోజు వారీ జరిగే అన్ని రకాల రిజిస్ట్రేషన్లు, నాన్-రిజిస్ట్రేషన్ల కార్యకలాపాల వినియోగానికి ఈ-స్టాంపులను ఉపయోగించవచ్చు.

పారదర్శకతను పెంచేందుకే..



రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖలో పారదర్శకతను పెంచేందుకు ఈ-స్టాంపింగ్‌ను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. నాన్-జ్యుడీషియల్ స్టాంపులతో సమాన విలువైన ఈ-స్టాంపులు అందుబాటులో ఉన్నాయి. దస్తావేజుల స్థానంలో ప్రజలు వీటిని ఉపయోగించవచ్చు. దస్తావేజుల కంటే వీటికి భద్రత ఎక్కువ. ప్రతి ఒక్కరూ ఈ-స్టాంపింగ్‌పై అవగాహన పెంచుకుని, సులువుగా లావాదేవీలు చేసుకునేందుకు చొరవ చూపాలి.

– టి. సుబ్బారెడ్డి, సబ్ రిజిస్ట్రార్, ప్రత్తిపాడు

క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎస్. సుబ్రహ్మణ్యశర్మ మంగళవారం తెలిపారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో మండల అభివృద్ధిపై చర్చిస్తారనర్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు.

భూ రీసర్వే పనులు ప్రారంభం



గౌరంపేటలో రీ సర్వే చేస్తున్న సర్వేయర్లు

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న భూ రీసర్వేను రైతులు ఉపయోగించుకోవాలని తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. గౌరంపేటలో రీ సర్వే పనులను ప్రారంభించారు. ఇప్పటికే మొదటి దశగా కొన్ని గ్రామాలు రీ సర్వే పూర్తి చేశామన్నారు. వీఆర్వో చందు, సర్వేయర్లు పాల్గొన్నారు.

6న వీపీబీ శాస్త్రి ట్రస్టు భూముల వేలం

గోకవరం: స్థానిక వీపీబీ శాస్త్రి ట్రస్టు భూములకు జూలై 6వ తేదీన కౌలు వేలం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సుగుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని సర్వే నెంబర్ 10/1, 245, 249, 236లో ఉన్న సుమారు 10 ఎకరాల భూమిని ఈ ఏడాది జూలై ఒకటి నుంచి వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ వరకూ సాగు చేసుకునేందుకు జూలై 6న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న దరావత్తు రూ.1000 చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

భూ సమస్యలపై సమీక్ష

రౌతులపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో గ్రామాల్లో భూ సమస్యలపై తహసీల్దారు భీమారా సమీక్షించారు. గ్రామాల్లోని నీటి తీరువా, పోలింగ్ బూత్‌లు ఓటరు నమోదు, ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ సర్వే పనులు నిర్వహణ, అడంగళ్, 1-బీ వంటి పలు భూ సంబంధిత సమస్యలపై గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వివిధ సమస్యలపై చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి ఎప్పటికపుడు పరిష్కార చర్యలు చేపట్టాలని ఆయన వీఆర్వోలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు పీవీవీ సత్యనారాయణ, వీఆర్వోలు గోవింద్‌కుమార్, నానాజి, చంటి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు మరింత విస్తృతం

ప్రత్తిపాడు: పోస్టల్ సేవలను విస్తృత పరుస్తున్నామని పోస్టల్ శాఖ కాకినాడ సూపరింటెండెంట్ డీఎస్‌యూ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రత్తిపాడు బ్రాంచ్ పోస్టాఫీసులో మంగళవారం సాయంత్రం తపాలా శాఖ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోస్టల్ శాఖపై ప్రతి ఒక్కరికీ నమ్మకం ఏర్పడేలా సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పోస్టల్‌శాఖ అందించే పథకాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. ప్రత్తిపాడు, ధర్మవరం బ్రాంచ్ పోస్టు మాస్టర్లు ఎర్ర సత్యనారాయణ, నంద్యాల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు



దిశ సమావేశంలో మాట్లాడుతున్న గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి

గోకవరం: రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన దిశ సమావేశంలో గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి పాల్గొని పలు సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమావేశంలో ఎంపీపీ గోకవరంలో అర్హులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఎనిమిది మంది రైతులకు ఇంకా నగదు ఇవ్వలేదన్నారు. అలాగే పలు సమస్యలను వివరించారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ మాధవీలత హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

తుని: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి కె.సాయికృష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. బీయస్సీ నర్సింగ్ చేసి రెండేళ్ల అనుభవం కలిగి ఉన్నవారికి గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో రెండు నెలల పాటు జర్మనీ భాష నేర్పించి బి.వన్ ఆఫర్ లెటర్‌తో ఉపాధి కల్పిస్తారన్నారు. అభ్యర్థి 20-35 ఏళ్ల మధ్య ఉండాలని, అవసరమైన పత్రాలు, రెజ్యూమ్, ఎడ్యుకేషన్ ధ్రువీకరణపత్రాలు, చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం ***www.aprrdc.in*** ను సంప్రదించాలని కోరారు.

'జగనన్న సురక్ష'తో అందరికీ పథకాలు



జగనన్న సురక్షపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ కొండలరావు



కేబీ మల్లవరంలో వలంటీర్లు నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రవికుమార్

ఏలేశ్వరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ పథకాలు అందజేస్తామని మున్సిపల్ కమిషనర్ కొండలరావు అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించి జగనన్న సురక్ష ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు మేలు చేసేందుకు జగనన్న సురక్ష నెలరోజులపాటు జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే ఈ కార్యక్రమం ద్వారా పొందవచ్చన్నారు. వచ్చేనెల ఒకటి నుంచి కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై సర్వే పరిశీలన

తుని రూరల్: జగనన్న సురక్ష సర్వే సమష్టిగా సమగ్రంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రవికుమార్ అన్నారు. మంగళవారం తుని మండలం కేఓ.మల్లవరం, రాపాకల్లో ఎంపీడీఓ రవికుమార్, ఎస్.అన్నవరంలో ఈఓపీఆర్‌డీ జయరామ్, వి.కొత్తూరులో ఏఓ శేషగిరిరావు వలంటీర్ల సర్వేను పరిశీలించారు. కేఓ మల్లవరంలో వలంటీర్లతో ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంటింటా సర్వే సమగ్రంగా జరగాలన్నారు. 11 రకాల సేవాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్న విషయాన్ని ప్రతి గృహానికి చేరాలన్నారు. అవసరైమన ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. దరఖాస్తుదారులందరికీ జూలైలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ధ్రువీకరణ పత్రాలను అందిస్తామన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఇతర శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యదర్శులు ఎస్‌వీ ఆదిత్య, మధుశేఖర్, పైల శివ, వీరబాబు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం, తంటికొండ, ఇ.టి.కాయలపల్లి గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లతో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, రౌతు జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కోటనందూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ ఐ జగదీష్ అన్నారు. మంగళవారం అల్లిపూడిలో జగనన్న సురక్ష కార్యక్రమ సన్నద్ధతను ఆయన ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, పంచాయతీ కార్యదర్శి ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: జగనన్న సురక్ష సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాజేశ్వరావు అన్నారు. మంగళవారం బూరుగుపూడి-1, 2 సచివాలయాలను ఎంపీడీఓ, తహసీల్దార్ కె.మాధవరావు సందర్శించి సర్వేపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

ఎస్సై, ఏఎస్సైలకు రివార్డులు

గండేపల్లి: స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్, ఏఎస్సై చంద్రశేఖర్, స్టేషన్ సిబ్బంది నాగేశ్వరరావు, సూరిబాబు ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా మంగళవారం రివార్డ్స్, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. సుమారు నెల రోజుల క్రితం గండేపల్లి పోలీస్ స్టేషన్లో నమోదైన గంజాయి కేసులో ఐదుగురు ముద్దాయిలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించినందుకు గాను ఈ రివార్డ్స్, ప్రశంసా పత్రాలను అందుకున్నట్టు తెలియజేశారు. కాకినాడలో ఎస్పీ కార్యాలయంలో జరిగిన నెల వారి క్రైమ్ రివ్యూ సమావేశంలో ఎస్పీ చేతుల మీదుగా వీటిని అందుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్సై సీహెచ్ విద్యాసాగర్, సిబ్బంది అభినందించారు.

జగనన్న కాలనీలలో మెరుగైన వసతులు

గండేపల్లి: జగనన్న కాలనీలో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు (పద్మనాభుడు) పేర్కొన్నరు.యల్లమిల్లిలో జగనన్న కాలనీని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈయన వెంట సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మదు, ఎంఎల్ఓ మేడిశెట్టి సత్యానారాయణ, ఎంపీటీసీ గొల్లేపల్లి అశ్విని, గ్రామ సచివాలయ కన్వీనర్లు గిల్లేపల్లి రవిబాబు, పోకల చంటి, సుంకవిల్లి సాయిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

డయాబెటిస్ కేర్ సెంటర్ ప్రారంభం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

తుని: స్థానిక గణపతినగర్‌లో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డయాబెటిస్ కేర్ సెంటర్‌ను వాకర్స్ ఇంటర్నేషనల్ 103 ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసి సంస్థ తరుపున వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ గణేష్, డాక్టర్ సూర్యనారాయణ 64 మంది వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేసి వైద్య సలహాలు అందజేశారు. క్లబ్ అధ్యక్షులు కుందెం సత్యన్నారాయణ, గరల్స్ జూనియర్ కాలేజీ పీఎంసీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, కార్యదర్శి చోడిశెట్టి బాబురావు, జూరెడ్డి చిరంజీవి, కుచ్చర్లపాటి భీమరాజు, చోడిశెట్టి త్రిమూర్తిస్వామి, కుళుమంచి సుబ్బరాయులు, కండవల్లి జోషఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వాకర్స్ హెల్త్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు చేతల మీదుగా రిక్షా కార్మికులకు టవళ్లు పంపిణీ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

జగ్గంపేట: మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులను జగ్గంపేట పోలీసులు కోర్టుకు హాజరుపరచగా ఇద్దరకి జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.20వేల జరిమానా విధించినట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం... జగ్గంపేటలో రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న బి.రంజిత్, యు.శ్రీను, డి.వీరబాబు, ఎన్.గుర్రయ్యలను పట్టుకున్నారు. వీరిని పెద్దాపురం కోర్టులో మంగళవారం హాజరుపరచగా పెద్దాపురం జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ వాహనాలు నడిపిన బి.రంజిత్, యు.శ్రీనులకు ఒక్కక్కరికి రూ.10వేలు జరిమానా విధించారు. డి.వీరబాబుకు రెండు రోజులు జైలు శిక్ష, ఎన్.గుర్రయ్యకు 5 రోజులు జైలు శిక్ష విధించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తరచూ నిర్వహిస్తున్నామని ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కిర్లంపూడి: లారీ ఢీకొని మహిళా మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగినట్టు కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం, తూర్పుపాకల గ్రామానికి చెందిన ఆకుల నాగమణి(47) తన భర్త అప్పారావుతో కలిసి సోమవారం ఏలేశ్వరంలో వారి బంధుల ఇంట జరుగుతున్న శుభ కార్యానికి వెళ్లారు. తిరిగి ప్రయాణంలో మోటారుసైకిల్‌పై వస్తుండగా సోమవరం జాతీయ రహదారిపై వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే నాగమణి మరణించింది. మృతి రాలికి కూతురు ఉంది. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. రాచపల్లి గ్రామంలో సారా స్థావరంపై దాడి చేసి, 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ కేసులో పెద్దిపాలెం గ్రామానికి చెందిన బట్టీ యజమాని కాండ్రేగుల కృష్ణ పరారయ్యాడు. కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురంలో ఐదు లీటర్ల సారాతో బొంతు దుర్గయ్యను అరెస్టు చేశామన్నారు. వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అశోక్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలివ్వాలి

తుని: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.రాము డిమాండ్ చేశారు. మంగళవారం భారత్ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యారంగం సమస్యలపై నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రాము మాట్లాడుతూ ప్రభుత్వం తరపున పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, ఆహ్మద్, సాయి, కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల విరాళాలు అభినందనీయం

తుని రూరల్: కొత్త సూరవరంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు విరాళాలు ఇవ్వడం అభినందనీయమని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు అన్నారు. మంగళవారం తుని బాలికల జూనియర్ కళాశాల చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజుతో కలసి వైస్ ఎంపీపీ పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయిని వి.రమణమ్మ రూ.50వేలు, హెచ్ఎం జి.అమ్మతల్లి రూ.పది వేలు చెక్కులను ఎంఈఓ పరవాడ గీతాదేవికి అందజేశారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయిని తలుపులమ్మ రూ.ఐదు వేలు, ఆయా రూ.ఐదు వేలు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు రూ.20వేలు విరాళం ప్రకటించారు. ప్రహరీకి అవసరమైన నిధులను దాతల నుంచి అందిస్తామని సత్యనారాయణరాజు ప్రకటించారు. రూ.50వేలు విరాళం ఇచ్చిన రమణమ్మను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్య నాగేశ్వరరావు మాట్లాడుతూ మనబడి నాడు-నేడులో ప్రభుత్వం రూ.16 లక్షలు మంజూరు చేసిందన్నారు. చిన్నారుల భద్రత దృష్ట్యా అత్యవసరంగా కావడంతో దాతల విరాళాలతో ప్రహరీ నిర్మిస్తున్నట్టు చెప్పారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తుందని హెచ్ఎం అమ్మతల్లి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలని, అందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించాలన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ వంగలపూడి భవానీ, ఎంఈఓ-2 రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు కుసనం దొరబాబు, వంగలపూడి అప్పారావు, నాయకులు వంగలపూడి వాసు, వంగలపూడి వీరబాబు పాల్గొన్నారు.



ఎంఈఓకి చెక్కును అందజేస్తున్న వైస్ ఎంపీపీ సత్య నాగేశ్వరరావు, టీచర్ రమణమ్మ

అంగన్‌వాడీ సెంటర్ల పరిశీలన

తొండంగి: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లను ఐడీడీఎస్ పీడీ ప్రవీణ మంగళవారం పరిశీలించారు. తొండంగి, ఏ.కొత్తపల్లి శృంగవృక్షం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పనితీరు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు విష్ణుకుమారి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

ప్రత్తిపాడు: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసినట్టు ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐలాజ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, కర్నాటక హైకోర్టు న్యాయవాది క్లిఫ్టన్ డి.రాజోరియో ముఖ్యఅతిథిగా పాల్గొని విజయవాడలో జరిగిన రాష్ట్ర ఐలాజ్ సమావేశంలో ఈఅడ్‌హక్ కమిటీని నియమించినట్టు ఆయన తెలిపారు. పూర్వ తూర్పు గోదావరి జిల్లా నుంచి అవసరాల దేవీ (ప్రత్తిపాడు), పిల్లా రాజు (పిఠాపురం), రాగాల ఉమామహేశ్వరరావు (కాకినాడ), కొత్తుం అనూహ్య (తుని), సాయిలక్ష్మి (ఎన్‌టీఆర్ జిల్లా), ఉదయ్‌కిరణ్ (కృష్ణా జిల్లా), వెంకటరావు (శ్రీకాకుళం), ఏర్నూరి రాఘవేంద్రరావు (మొవ్వ), అవనిగడ్డకు చెందిన పులి శ్రీను, సీహెచ్ భాస్కరరావు, చీఫ్ ఎడ్వైజర్‌గా బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు ఎస్ఎస్ఎస్ రామ్ ప్రసాద్‌లను రాష్ట్ర హడ్‌హక్ కమిటీ సభ్యులుగా నియమించారన్నారు. నూతన హడ్‌హక్ కమిటీ ఏర్పాటుతో పాటు భవిష్యత్తు కార్యాచరణ కూడా రూపొందించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 31వ తేదీ వరకూ న్యాయ శాస్త్ర విద్యార్థులకు ఎన్‌రోల్‌మెంట్ ఫీజు రూ.750 మాత్రమే ఉండాలని, 60 ఏళ్లు దాటిన న్యాయవాదులకు బార్ కౌన్సిల్ పెన్షన్ సదుపాయం కలుగజేయాలని, త్వరలో రాష్ట్ర స్థాయిలో ఐలాజ్ మొదటి మహాసభ నిర్వహించాలని తీర్మానించామన్నారు. ఐలాజ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆయా సమస్యల సాధన కోసం జరిగే ఆందోళనలో ఐలాజ్ సభ్యులు పాల్గొని, విజయవంతం చేయాలని ఐలాజ్ రాష్ట్ర హడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ కోరారు.



ఎంపికైన ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ సభ్యులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఏలేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నేత, మాజీ సర్పంచ్ భేరి అరవిందకుమార్ అన్నారు. పేరవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం హెచ్ఎం శ్రీనివాస్ అధ్యక్షతన పాఠశాలల్లో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న గోరుముద్ద వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నాడునేడు ద్వారా కోట్లాది రూపాయలతో పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ బాలరాజు, వైస్ చైర్మన్ గంగారత్నం, బొడ్డు సూరిబాబు, ఉపాధ్యాయుడు జి.సుందరరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములుకావాలి

కోటనందూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఎంఈఓ శ్రీనివాసు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యలుంటే పాఠశాలకు వచ్చి ప్రశ్నించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై తల్లిదండ్రుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ వేణుగోపాల్, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి కనకదుర్గశ్రీను, ఉపాధ్యాయులు, సీఆర్పీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కోటనందూరులోని జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

నాణ్యమైన నారుతో మంచి దిగుబడి

గండేపల్లి: నాణ్యమైన నారును వేసుకుంటే మంచి దిగుబడి పొందవచ్చని వ్యవసాయాధికారి పి.సద్గురుమూర్తి రైతులకు సూచించారు. మురారిలో మంగళవారం వరి నారుమడులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరి నారు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నారు మడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలు దమ్ము చేసి చదును చేయాలని, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. ఐదు సెంట్లు నారుమడికి రెండు కిలోల నత్రజనిని విత్తనం చల్లే ముందు కిలో, విత్తనాలు చల్లిన 12 నుంచి 14 రోజుల వ్యవధిలో కిలో వేసుకోవాలన్నారు. కిలో భాస్వరం, కిలో పోటాష్ ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. శుద్ధి చేసి మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకి ఐదు కిలోల చొప్పున చల్లుకోవాలని, నారు ఒక ఆకు పూర్తిగా పురి విచ్చుకునే వరకూ నీరు ఇచ్చి తరువాత తక్కువగా నీరు పెట్టాలన్నారు.

అంగన్‌వాడీల పోరుయాత్ర

గోకవరం: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.బేబి రాణి అన్నారు. యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గోకవరంలో అంగన్‌వాడీ పోరుయాత్ర నిర్వహించారు. స్థానిక దేవీచౌక్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతున్నాయన్నారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్ ఇవ్వాలని, అధికార రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. యూనియన్ జిల్లా జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మాణిక్యాంబ, టి.బేబిరాణి, ఐఎన్‌టియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్షులు సుందరబాబు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంఘం పోరాట ఫలితంగానే సత్రం భూములకు వేలం

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలో సుందరమ్మ సత్రం భూముల విషయంలో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పోరాట ఫలితంగానే కౌలు వేలం జరిగాయని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మంగళవారం వేలం పాటల అనంతరం ఆయన సంఘం సభ్యులతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సత్రం భూములు గ్రామంలో ఉన్నాయన్న సంగతి గ్రామ ప్రజలకు కూడా తెలియదని, తమ సంఘం ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలు చేశామన్నారు. ఈ ఫలితంగా కౌలు వేలం నిర్వహించగా ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయం సమకూరిందన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజబాబు, బి.రమేష్, కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.